నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 6 ఆగస్టు 2024 | HYDERABAD



జపాన్‌కు చెందిన జేఆర్ క్యూషు కంపెనీ, సింగపూర్‌కు చెందిన ఐసీఎంజీ గ్రూపు ప్రతినిధుల బృందాలు టీ హబ్‌ను సందర్శించాయి. టెక్నాలజీ స్టార్టప్‌లతో దేశ, విదేశాల్లోనూ కార్యకలాపాలను నిర్వహిస్తున్న టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో జపాన్, సింగపూర్‌కు చెందిన కంపెనీ ప్రతినిధుల బృందాలు టీ హబ్‌లో జరుగుతున్న స్టార్టప్ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించినట్లు టీ హబ్ ప్రతినిధి తెలిపారు. -సిటీబ్యూరో

సోమవారం నిరసన తెలుపుతున్న విద్యార్థులు

'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి

చదువుకున్నోళ్లే చెత్తేస్తున్నారు!

పచ్చదనం.. పరిశుభ్రత పెంపొందేలా ప్రజలు సహకరించాలి

'స్వచ్ఛదనం.. పచ్చదనం' ప్రారంభోత్సవంలో మేయర్ గద్వాల్

సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): చదువుకున్న వాళ్లే రహదారులపై చెత్త వేస్తున్నారని మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ చెత్త వేసే ప్రాంతాల(జీ వీపీ)ను ఉదయం శుభ్రం చేసినా.. సాయంత్రం వరకు మళ్లీ వ్యర్థాలు పేరుకుపోతున్నాయన్నారు. చదువుకున్న వారే రహదారులపై చెత్త వేస్తున్నారని మేయర్ పేర్కొన్నారు. సోమవారం ఎన్‌బీటీనగర్‌లో 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమాన్ని కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ గ్రేటర్‌లో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. గ్రేటర్‌లో 4 వేలకు పైగా స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణ జరిగినా.. ఇంకా వ్యర్థాలను బయట వేస్తున్నారన్నారు. గ్రేటర్‌లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు 5 రోజుల పాటు సుందరీకరణతో పాటు పరిశుభ్రత పనులు చేపడుతున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. కుక్కల నుంచి జాగ్రత్తగా ఉండాలని, చిన్న పిల్లలను తల్లిదండ్రులు ఒంటరిగా బయటకు పంపొద్దని సూచించారు. కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ నగరాన్ని శుభ్రంగా ఉంచాలని, రోడ్డుపై చెత్త వేయొద్దని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి కోరారు. ఖైరతాబాద్ పరిధిలో 700 స్వచ్ఛ ఆటోలు ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆటోలకే వ్యర్థాలను అందజేయాలన్నారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 24x7 సిబ్బందితో పాటు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే శంషాబాద్ మండలం పెద్దగోల్కొండ, శంకరాపూర్ గ్రామాల్లో నిర్వహించిన 'స్వచ్ఛదనం – పచ్చదనం'లో పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కుమార్ భాగస్వాములయ్యారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీ తీశారు.

చెత్త ఊడ్చి..

కాచిగూడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పచ్చదనం–పరిశుభ్రత' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెత్తను ఊడ్చి.. ట్రాలీలో వేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్‌మీడియెట్ విద్యాధికారి ఒడ్డెన్న, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించి..వాహనంలో వేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కలెక్టర్ అనురాగ్ దురిశెట్టి

ఆరా తీసి..అభయమిచ్చి

షాద్‌నగర్‌లో పోలీసుల థర్డ్ డిగ్రీ బాధితురాలికి అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

పోలీసుల వైఖరిపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, నవీన్‌కుమార్ డిమాండ్

సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ)/షాద్‌నగర్ : ఇబ్బడిముబ్బడిగా నేరాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల థర్డ్ డిగ్రీతో అనారోగ్యంతో షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న దళిత మహిళను సోమవారం ఆమె పరామర్శించారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. మహిళ అని కూడా చూడకుండా, పోలీసులు విచక్షణా రహితంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం అసెంబ్లీలో మహిళా సభ్యులను అవమానిస్తుంటే.. పోలీసులు కూడా అదే వైఖరి అవలంభిస్తూ మహిళను విచక్షణారహితంగా కొట్టారన్నారు. సీఎం సోదరుల కాన్వాయ్‌కు రక్షణ కల్పించే పనిలో ఉన్న పోలీసులకు సామాన్యులు కన్పించడం లేదని ఎద్దేవా చేశారు. థర్డ్ డిగ్రీ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. థర్డ్ డిగ్రీకి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీలు సురభి వాణీదేవీ, నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్యులకు రక్షణ కరువైందని శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని మాజీ ఎంపీ మంద జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అభిప్రాయపడ్డారు. అనంతరం వారు బాధితురాలికి లక్ష రూపాయల ఆర్థికసాయం అందజేశారు.

ఆక్రమణల కూల్చివేత.. ఆగ్రహం

ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ ఉక్కుపాదం మోపింది. ఎల్బీ స్టేడియం నుంచి ఎంజే మార్కెట్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించింది. అయితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జోనల్ కార్యాలయ పరిధిలోని ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసుల సహకారంతో ఎల్బీ స్టేడియం నుంచి మొదలుకుని ఎంజే మార్కెట్ వరకు ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను కూల్చివేశారు. అయితే తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదంటూ..బాధితులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాంతాల వారీగా ఫుట్‌పాత్ ఆక్రమణలను కూల్చివేయాలని నిర్ణయించి.. ఆ ప్రక్రియ చేపట్టినట్లు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ సయీదుద్దీన్ తెలిపారు. - అబిడ్స్

ప్రైవేట్ హాస్టళ్లలో భద్రత డొల్ల

పని చేయని 'సీసీ'లు.. డీవీఆర్‌లు

సెక్యూరిటీ గార్డులు లేకుండానే నిర్వహణ

ఖైరతాబాద్, ఆగస్టు 5 : ప్రైవేట్ హాస్టళ్లలో భద్రత కరువవుతున్నది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నది. పంజాగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో పలు హాస్టళ్లను పోలీసులు తనిఖీలు చేపట్టగా, డొల్లతనం బయటపడింది. అనేక హాస్టళ్లలో పని చేయని సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డు వ్యవస్థ, హాస్టళ్లలో చేరే వారి పేర్లు సరిగా లేకపోవడం, దానికి సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించకపోవడాన్ని పోలీసులు గుర్తించారు. పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, సీఐ శోభన్ నేతృత్వంలో 25 మంది సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే వివిధ హాస్టళ్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుండడంతో పాటు మరికొన్నింటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వచ్చాయి. అలాగే పలు డ్రగ్స్ విక్రయ ముఠాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు సైతం వినిపించాయి. దీంతో పోలీసులు ప్రైవేట్ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

పని చేయని సీసీ కెమెరాలు

పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో గతంలో అనేక చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఓ సెల్‌ఫోన్ సైతం అపహరణకు గురికాగా, సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను పట్టుకునేందుకు నానా తంటాలు పడ్డారు. నెల రోజుల కిందట పోలీస్ అధికారులు..సుమారు 250 మంది హాస్టళ్ల యాజమాన్యాలను పిలిపించి.. నిబంధనలను పాటించాలంటూ.. స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా..ఏ ఒక్క హాస్టల్ యజమాని కూడా నిబంధనలను పాటించడం లేదన్న విషయం తాజా తనిఖీల్లో వెలుగు చూశాయి. సోమవారం అమీర్‌పేటలోని హ్యాపీ హోమ్స్, కావూరి మెన్స్ హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించగా, సీసీ కెమెరాల వ్యవస్థ లేదు. ఉన్న కెమెరాలు పనిచేయకపోవడంతో పాటు దానిని భద్రపరిచే డీవీఆర్ పనిచేయడం లేదు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 250కి పైగా ప్రైవేట్ హాస్టళ్లు ఉన్నాయి. గతంలోనే ఆయా హాస్టళ్లను పరిశీలించిన పోలీసులు వారికి నోటీసులు సైతం జారీ చేశారు. అయినా యాజమాన్యాలు పట్టించుకోలేదు. తాజాగా జరిగిన తనిఖీల్లో సెక్యూరిటీ గార్డులే కనిపించలేదు. ఒక్క హాస్టల్‌లో కూడా సరైన సెక్యూరిటీ వ్యవస్థ లేదు. రాత్రి వేళల్లో హాస్టళ్ల వద్ద లైట్లు సైతం వెలుగడం లేదు. దీంతో తరచూ దొంగతనాలు జరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. హాస్టళ్లలో చేరే వారి సమాచారం కూడా యాజమాన్యాల వద్ద లేకపోవడాన్ని గుర్తించారు. కొందరి ఆధార్ కార్డులు సైతం అస్పష్టంగా ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా నడిచే హాస్టళ్లపై చర్యలు

పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో 250 హాస్టళ్లు నడుస్తున్నాయి. అందులోచాలా హాస్టళ్లు సరైన నిబంధనలు పాటించడం లేదన్న విషయం మా దృష్టికి వచ్చాయి. దొంగతనాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులందాయి. ఇప్పటికే పలు హాస్టళ్ల యాజమాన్యాలకు నోటీసులు సైతం పంపించాం. సోమవారం జరిపిన తనిఖీల్లో సీసీ కెమెరాలు, పుటేజీల బ్యాకప్, సెక్యూరిటీ గార్డుల వ్యవస్థ లేకపోవడాన్ని గుర్తించాం. త్వరలోనే వారందరికీ నోటీసులు పంపించి కఠిన చర్యలు తీసుకుంటాం.

- మోహన్ కుమార్, ఏసీపీ పంజాగుట్ట

ఓ హాస్టల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పంజాగుట్ట పోలీసులు

దోమల పేరుతో దోపిడీ!

ఫాగింగ్ చేయకుండానే డీజిల్ సొమ్ము పక్కదారి ● సీనియర్ ఎంటమాలజిస్ట్ బాగోతం

సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో జనం డెంగీ దోమలతో పడరాని పాట్లు పడుతుంటే.. జీహెచ్ఎంసీలోని కొందరు ఎంటమాలజిస్ట్ అధికారులు అవినీతికి తెరలేపి.. అందినంత దండుకుంటున్నారు. ఫాగింగ్ చేయకుండానే బ్లాక్ మార్కెట్‌కు డీజిల్ తరలించిన కూకట్‌పల్లి జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఫాగింగ్ సిబ్బంది అంతా ఎన్నికల విధుల్లో ఉన్న సమయంలో సదరు అధికారి ఫాగింగ్ చేసినట్టు బిల్లులు డ్రా చేసి.. ఖజానాకు కన్నం వేశారు. డీజిల్ అక్రమాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను జాబ్‌లోంచి తీసేస్తానంటూ బెదిరించి.. ఒక్కొక్కరి (ఈఎఫ్ఏ) నుంచి రోజుకు సగటున రూ.25వేలు వసూలు చేశారు. సదరు మహిళా అధికారి ఆగడాలకు విసిగిపోయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది డబ్బులు ఇచ్చి.. ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టారు. కాగా, సదరు సీనియర్ ఎంటమాలజిస్ట్ గతంలో వరంగల్ జిల్లాలో పనిచేసిన సమయంలోనూ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. డీఎంఓగా ప్రమోషన్ వచ్చినా.. వెళ్లకుండా డిప్యుటేషన్‌పైనే కొనసాగుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన ట్రాన్స్‌ఫర్లలో ఆమె బదిలీ అయి.. తిరిగి ఒక్క రోజులోనే తన స్థానాన్ని పదిలం చేసుకున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. మొత్తంగా సదరు అధికారి అక్రమాలపై విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నది. నేడు కమిషనర్‌కు సమగ్ర నివేదికను సమర్పించే అవకాశాలు ఉన్నాయి.



ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నుంచి డబ్బులు తీసుకుంటున్న సీనియర్ ఎంటమాలజిస్ట్

రోడ్డెక్కి.. నిరసన తెలిపి..

సుల్తాన్‌బజార్, ఆగస్టు 5: నిజాం కళాశాలలోని గర్ల్స్ హాస్టల్‌ను వంద శాతం యూజీ విద్యార్థినులకే కేటాయించాలంటూ.. సోమవారం సైతం విద్యార్థులు ఆందోళన చేశారు. తొలుత చింతచెట్టు వద్ద నిరసన తెలిపిన విద్యార్థులు.. తమకు న్యాయం చేయాలంటూ.. రోడ్డెక్కారు. బషీర్‌బాగ్ చౌరస్తాలో బైఠాయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో అబిడ్స్ పోలీసులు విద్యార్థులను శాంతింపజేసేందుకు యత్నించారు. వారు వినకపోవడంతో అరెస్టు చేసి.. షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ ఏడాది యూజీ విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఇందుకు అణుగుణంగా హాస్టల్‌లో వంద శాతం యూజీలకే వసతి కల్పించాలని 5,6 రోజులుగా శాంతియుతంగా నిరసనలు చేపట్టామని, తమకు న్యాయం చేయాలనే రోడ్డెక్కినట్లు విద్యార్థులు చెప్పారు. నిజాం కళాశాలలో గర్ల్స్ హాస్టల్ నిర్మాణం పూర్తయిన అనంతరం యూజీ, పీజీలకు హాస్టల్ వసతి కేటాయించినట్లు ప్రిన్సిపాల్ భీమా తెలిపారు. హాస్టల్ సామర్థ్యం 300 మాత్రమే అయినా.. విద్యార్థినుల ఇబ్బందులు చూడలేక 450 మందికి వసతి కల్పించినట్లు చెప్పారు.

బాలికను నిర్బంధించి.. లైంగికదాడి

బేగంపేట, ఆగస్టు 5: ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను బెదిరించి.. నిర్బంధించి..లైంగికదాడికి పాల్పడ్డాడు ఓ యువకుడు. బేగంపేట పోలీసుల కథనం ప్రకారం.. బేగంపేటలో నివాసముండే వ్యక్తి ఆదివారం విధుల కోసం బయటకు వెళ్లాడు. ఇంట్లో కూతురు ఒంటరిగా ఉంది. పని ముగించుకొని సాయంత్రం అతడు ఇంటికి వచ్చాడు. తలుపు తట్టినా.. కూతురు తీయకపోవడంతో కంగారు పడి..బలవంతంగా నెట్టాడు. అంతలోనే సోనూ(20) అనే యువకుడు తోసుకుంటూ.. బయటకు పరుగులు తీశాడు. ఏం జరిగిందని తండ్రి కూతురును ఆరా తీయగా, తన నోట్లో గుడ్డలు కుక్కి నిర్బంధించి లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు..పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

సిటీలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ కోర్టు

ఐదెకరాల్లో రూ.200కోట్లతో నిర్మాణం

సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కొత్త మైదానాలను ఏర్పాటు చేయాలని బల్దియా నిర్ణయించింది. ఇందులో భాగంగానే గ్రేటర్‌లో భారీ స్థాయిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఫుట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేయనున్నది. ఐదెకరాల్లో రూ. 200కోట్ల వ్యయంతో నిర్మించే ఈ ఫుట్‌బాల్ కోర్టు కోసం అధికారులు ఎల్బీనగర్, ఉప్పల్, సికింద్రాబాద్–తిరుమలగిరి, కూకట్‌పల్లి, ఖైరతాబాద్–షేక్‌పేట, శేరిలింగంపల్లి–గచ్చిబౌలి ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. త్వరలో అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి ప్రతిపాదనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.

రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలి

సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): ఆక్రమణలకు గురైన చెరువు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రై సిటీ పరిధిలోని చెరువులను ఆక్రమించడంతో పాటు అక్రమంగా జరిగిన నిర్మాణాలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని, రిపోర్టు ఆధారంగా అక్రమార్కులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

బాలుడు ఎక్కడ?

24 గంటలు గడిచినా.. లభించని ఆచూకీ

మహేందర్ రెడ్డి

బడంగ్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కనిపించకుండాపోయిన బాలుడి ఆచూకీ ఇంకా లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మీర్‌పేట దాసరి నారాయణ రావు కాలనీలో నివాసముండే మధుసూదన్‌రెడ్డి కవిత దంపతుల రెండో కుమారుడు మహేందర్‌రెడ్డి (13) ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ట్యూషన్‌కు పోయి వస్తానని చెప్పి.. తిరిగి రాలేదు. బాలుడి కోసం ఆరు బృందాలను రంగంలోకి దింపి గాలిస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. నిందితుడు బాలుడిని ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో నమోదయ్యాయని చెప్పారు. వాహనం నంబర్ ప్లేట్ గుర్తించకపోవడంతో వివిధ చోట్ల బాలుడు కోసం గాలిస్తున్నామన్నారు.

ప్రజావాణి అర్జీలు వెంటనే పరిష్కరించాలి

సిటీబ్యూరో: ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలను లిఖిత పూర్వకంగా తెలుపాలన్నారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 8 విన్నపాలు రాగా, సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు.